క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకులకు షోకాజ్ నోటీసులు

జనగామ: గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో గ్రూపులు కట్టి, బీఆర్‌ఎస్‌కు ఓట్లు పడేలా వ్యవహరించారని తెలుపుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జనగామకు చెందిన ఇద్దరు నాయకులకు షోకాజ్ నోటీసులను అందజేశారు. దీనిపై మూడు రోజుల్లో సమాధానం ఇవ్వని పక్షంలో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని అందులో పేర్కొన్నారు. ఈ విషయమై మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ నోటీసు ఇవ్వాలంటే రాష్ట్ర స్థాయిలో క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి నుంచి రావాలన్నారు. నోటీసుల విషయమై చిన్నారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లగా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు నోటీసులు ఇచ్చే అధికారం లేదని చెప్పారన్నారు. నోటీసుల విషయంలో నియోజకవర్గంలో పార్టీ కేడర్‌తో కలిసి ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేశారన్నారు. ఎలక్షన్ సమయంలో ఏం జరిగిందనే దానిపై తామంతా కలిసి పూర్తి క్లారిటీ ఇస్తామన్నారు.

ఎన్నిక

లింగాలఘణపురం: మండలంలోని కుందారం ప్రాథమిక పాఠశాలలో పని చేసే పొట్టబత్తిని భాస్కర్ టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు సమక్షంలో శనివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జి.కృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఇంద్రసేనారెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎం.మాధవి, కోశాధికారి నవీన్‌తో పాటు కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, సైదులు, పద్మజ, పూర్ణిమ, ఎలిజబెత్‌రాణిలను ఎన్నుకున్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

బచ్చన్నపేట: మండల కేంద్రంలో రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం నేడు (ఆదివారం) నిర్వహించనున్నట్లు సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ లేబర్ కార్డు కలిగిన వారికి మాత్రమే ఉచిత పరీక్షలు చేస్తారని అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్ వద్ద ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిబిరాన్ని లేబర్ కార్డు, ఆధార్‌కార్డుతో వచ్చి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



జనగామ రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోడ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా ఆటోడ్రైవర్స్ యూనియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జేరుపోతుల కుమార్ కోరారు. శనివారం పట్టణంలోని బతుకమ్మ కుంట వద్ద సర్కిల్ హాల్‌లో పట్టణ అధ్యక్షుడు శ్రీశైలం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రాష్ట్రంలో లక్షల మంది ఆటోడ్రైవర్లు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఉపాధి చూపించాలని కోరారు. మల్లయ్య, అంజాద్, ఫయాజ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గ్రామ పర్యటనలు

చిల్పూరు: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు త్వరలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన గ్రామ పర్యటనలు నిర్వహించనున్నట్లు పార్టీ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కమిటీ రోజుకొక్క గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుని నివేదికను ఇందిరకు అందజేస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్, ఎంపీటీసీలు కుమార్, శిరీషసురేష్, యాదగిరి, యశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి పాటుపడాలి'

జఫర్‌గఢ్: గ్రామ స్థాయిలో సీపీఐని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు పాటుపడాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జువారి రమేష్ కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అనేక సమస్యలు పెరుకపోయి ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిందని, వాటి పరిష్కారం కోసం రానున్న రోజుల్లో సీపీఐ ఆధ్వర్యాన మరిన్ని పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 11 గంటలకు పార్టీ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి హాజరవుతున్నారని, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. రడపాక సత్తయ్య, యాకుబ్ పాష, బుచ్చయ్య, జాఫర్ ఉన్నారు.

ఎంపీపీపై అవిశ్వాసానికి ఆర్డీఓకు దరఖాస్తు

- హాట్‌టాపిక్‌గా మారిన అంశం



ఆర్డీఓకు దరఖాస్తు చేస్తున్న ఎంపీటీసీలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు కందుల రేఖగట్టయ్యపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ తొమ్మిది మంది ఎంపీటీసీల సంతకాలతో కూడిన దరఖాస్తును ముగ్గురు ఎంపీటీసీలు శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వాసం రామ్మూర్తికి సమర్పించారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఘన్‌పూర్–1 ఎంపీటీసీ గన్ను నర్సింహులు, శివునిపల్లి–2 ఎంపీటీసీ గుర్రం రాజు, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఘన్‌పూర్–3 ఎంపీటీసీ సింగపురం దయాకర్ డోకు దరఖాస్తును అందించారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎంపీపీ కందుల రేఖపై అదేపార్టీకి చెందిన వారే అసమ్మతితో అవిశ్వాసానికి కోరడం మండలంలో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2019 జూలైలో జరిగిన ఎన్నికల్లో ఘన్‌పూర్ ఎంపీపీ ఎస్సీ రిజర్వేషన్ కాగా మీదికొండ, రాఘవాపూర్ గ్రామాలకు చెందిన ఎంపీటీసీగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎన్నికైన కందుల రేఖ(ఎస్సీ మాల) అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆశీస్సులతో ఎంపీపీగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. 2024 జూలైలో ఎంపీటీసీల పదవీకాలం ముగియనుంది. అయితే ఎంపీపీపై అవిశ్వాసం పెట్టేందుకు గత కొద్దిరోజులుగా ఎంపీటీసీలు రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సస్పెన్స్‌కు తెరదించుతూ తొమ్మిది మంది ఎంపీటీసీల సంతకాలతో కూడిన దరఖాస్తును ఎంపీపీపై అవిశ్వాసాన్ని కోరుతూ ఆర్డీఓకు అందించారు. సంతకాలు చేసిన వారిలో ఆరుగురు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారుండగా, ముగ్గురు కాంగ్రెస్ పార్టీ వారున్నారు. పడిశాల సుగుణ(సముద్రాల) కాంగ్రెస్, సింగపురం దయాకర్(స్టేషన్‌ఘన్‌పూర్–3) కాంగ్రెస్, కనకం స్వరూపగణేష్(ఛాగల్లు) బీఆర్‌ఎస్, మునిగెల రాజు(ఘన్‌పూర్–2) బీఆర్‌ఎస్, గుర్రం రాజు(శివునిపల్లి–2) బీఆర్‌ఎస్, గన్ను నర్సింహులు(ఘన్‌పూర్–1) బీఆర్‌ఎస్, చల్లా సుధీర్‌రెడ్డి–వైస్ ఎంపీపీ (తాటికొండ) బీఆర్‌ఎస్, ఇనుగాల రజిత(పాంనూర్) బీఆర్‌ఎస్, మాలోత్ లలిత(విశ్వనాథపురం) కాంగ్రెస్ తొమ్మిది మంది సంతకాలతో కూడిన దరఖాస్తును అందించారు. మొత్తంగా మండలంలో 15 మంది ఎంపీటీసీ స్థానాలకు గాను ప్రస్తుతం ముగ్గురు ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీలో, ఒక్కరు సీపీఎంలో, 11 మంది బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నారు. కాగా అవిశ్వాసం ఒకే అయితే బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఛాగల్లు ఎంపీటీసీ కనకం స్వరూపగణేశ్ ఎంపీపీ పీఠం దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఏది ఏమైనా అధికార పార్టీకి చెందిన ఎంపీపీ కందుల రేఖపై అదే పార్టీకి చెందిన ఎంపీటీసీలు అవిశ్వాసానికి వెళ్లడం ప్రస్తుతం మండలంలో హాట్‌టాపిక్‌గా మారింది.

ఎమ్మెల్యే కడియం దృష్టికి వెళ్లిన అంశం

బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎంపీపీ కందుల రేఖపై అదేపార్టీకి చెందిన ఎంపీటీసీలు అవిశ్వాసం కోసం ఆర్డీఓ వద్దకు వెళ్లిన సమాచారం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి వెళ్లింది. ఈ విషయమై బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీటీసీలతో కడియం మాట్లాడనున్నట్లు విశ్వసనీయ సమాచారం. అదే జరిగితే అవిశ్వాసం వీగే అవకాశం ఉంది.

నిబంధనల మేరకు పనిచేస్తాం: ఆర్డీఓ

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం కోసం ఎంపీటీసీల దరఖాస్తు విషయమై నిబంధనల మేరకు పనిచేస్తామని ఆర్డీఓ వాసం రామ్మూర్తి తెలిపారు. ఎంపీటీసీలు అందించిన దరఖాస్తులో తొమ్మిది మంది సంతకాలు ఉన్నాయని, అయితే ప్రత్యక్షంగా ముగ్గురు మాత్రమే వచ్చారని, సంతకాల విషయమై మిగిలిన వారితో మాట్లాడి వారి సమ్మతిని తీసుకుంటామన్నారు. అనంతరం ఎంపీపీకి నోటీసులు అందిస్తామని, తదనంతరం ఎంపీటీసీల సమక్షంలో తదుపరి చర్యలు చేపడతామన్నారు. కాగా, ఈ ప్రక్రియకు రెండు వారాలు పడుతుందని స్పష్టం చేశారు.

ఆకతాయిల ఆగడాలతో పాఠశాలల్లో గందరగోళం



ధ్వంసమైన పాఠశాల పేరు సూచించే అక్షరాలు



బోర్డు కింద సజ్జపై పడిఉన్న రాళ్లు, రప్పలు

లింగాలఘణపురం: పాఠశాలలకు సెలవొస్తే చాలు ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నాయి. పాఠశాలల్లోనే సిగరెట్లు, మద్యం తాగడంతో పాటు పాఠశాలల ఆవరణలో ఉన్న లైట్లు, మరుగుదొడ్లను ధ్వంసం చేస్తున్నారు. తాము చదువుకొన్న పాఠశాలలనే ఇంగిత జ్ఞానం కూడా లేకుండా స్కూల్ బోర్డులను కూడా రాళ్లతో కొట్టి ధ్వంసం చేస్తున్నారు. అందుకు ఉదాహరణగా మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇటీవలే మనఊరు–మన బడిలో చక్కగా రూపుదిద్దుకొన్న పాఠశాల బోర్డును రాళ్లతో కొట్టి ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా అక్షరాలు దెబ్బతిన్నాయి. అదేవిధంగా ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న లైట్లన్నీ పగులగొట్టారు. మరుగుదొడ్డిలోని బేసిన్‌ను ధ్వంసం చేశారు. ఇక ఆవరణ అంతా సిగరెట్ ముక్కలు, అగ్గిపెట్టెలతో నిండిపోతున్నాయి. పోలీసుస్టేషన్ ఆనుకొని ఉన్న పాఠశాలల్లోనే ఇలా జరిగితే ఎలా అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చాలా పాఠశాలలకు అటెండర్లు, స్వీపర్లు, నైట్‌వాచ్‌మన్లు లేకపోవడంతో ఆకతాయిలు చేసే పనులతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



భానును సన్మానిస్తున్న యోగా గురువులు

హన్మకొండ: జాతీయస్థాయి యోగా పోటీలకు వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన భాను ఎంపికైనట్టు ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. చేర్యాల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న భాను ఇటీవల నల్గొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 19, 20 తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో భాను పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భానును యోగా గురువులు పోశాల శ్రీనివాస్, సునీత సన్మానించారు.

జనగామను పాపన్న జిల్లాగా మార్చాలి



మంత్రి ప్రభాకర్‌తో బీసీ సంఘం నాయకులు

కొడకండ్ల: జనగామ జిల్లా పేరును సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా ప్రభుత్వం మార్చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొమ్మగాని విక్రం గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లను ఆయన కలిసి సన్మానం చేసి జిల్లా పేరును మార్చడంతో పాటు ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు దేశగాని నాగరాజు, గిరగాని కార్తీక్, రమేష్, రఘు, నరేష్, అరవింద్ ఉన్నారు.

మొక్కుల చెల్లింపు



పాలకుర్తి: ఎమ్మెల్యేగా యశస్వినిరెడ్డి గెలుపొందడంతో కాంగ్రెస్ నాయకులు తిరుమల తిరుపతికి పాదయాత్రగా వెళ్లి వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. యశస్విని రెడ్డి గెలుపొందాలని తిరుపతి దేవుడిని మండలంలోని ఈరవెన్ను కాంగ్రెస్ నాయకులు మొక్కుకున్నారు. మొక్కులో భాగంగా మోకాళ్లపై నడుచుకుంటూ మెట్లు ఎక్కి శనివారం మొక్కులు తీర్చుకున్నారు. యశస్వినిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందనుందని పార్టీ గ్రామ అధ్యక్షుడు బిర్రు సోమనారాయణ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గోనె మహేందర్ రెడ్డి చెప్పారు. అశోక్ రెడ్డి, అనుముల రమేశ్ రెడ్డి, అనుముల కుమార్ రెడ్డి, గాదరి కుమార్, పొన్నాల పెద్ద దామోదర్ పాల్గొన్నారు.

సోమిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు



సోమిరెడ్డి కుటుంబసభ్యులను ఓదారుస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

కొడకండ్ల: మండలంలోని పాకాల గ్రామానికి చెందిన కడిపికొండ సోమిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం విచారకరమని, తననెంతో కలచివేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం సోమిరెడ్డి మృతదేహానికి ఆయన నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేసే సోమిరెడ్డి మృతి తీరని లోటని, కుటుంబసభ్యులకు అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి,మార్కెట్ చైర్మన్ రాము,సర్పంచ్ శ్రీలేఖ, నాయకులు రాజిరెడ్డి, సోమరాములు, మధు,సుధీర్‌రెడ్డి, మంగ్యానాయక్, రణధీర్, సతీష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కోర్టుకు భవనం ఇచ్చేది లేదు



ఆర్డీఓకు దరఖాస్తు అందజేస్తున్న ఎంపీపీ రేఖ

స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల ఘన్‌పూర్‌కు మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని ఇచ్చేది లేదని ఎంపీపీ కందుల రేఖగట్టయ్య శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వాసం రామ్మూర్తికి దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఆమె విలేకరులతో మాట్లాడుతూ 1975 నుంచి ఇక్కడ మండల పరిషత్ కార్యాలయం ఉందని, స్థానిక సంస్థలకు చెందిన భవనాన్ని ఇతర ప్రభుత్వ భవనాలకు ఇవ్వడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఎంపీడీఓ కార్యాలయ భవనాన్ని కోర్టుకు అందించేందుకు మాజీ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి లెటర్‌ప్యాడ్ ద్వారా వచ్చిందని అధికారుల ద్వారా తెలిసిందన్నారు. అయితే స్థానిక సంస్థల ఆస్తులను ఇతర ప్రభుత్వ భవనాలకు ఇచ్చేది లేదని, ఎంపీపీగా ఇందుకు అంగీకరించడం లేదని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి ఉన్నారు.

పరామర్శ



బచ్చన్నపేట: మండలంలోని పడమటికేశ్వాపూర్ ఎంపీటీసీ చల్ల సక్కుభాయి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పరామర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని రష్ ఆస్పత్రికి వెళ్లి గుండె నొప్పికి చికిత్స పొందుతున్న సక్కుభాయిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆయన కోరుకున్నారు. నాయకులు చల్ల తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జంగిటి రాజు, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఇరుకు భవనంతో ఇక్కట్లు



ఆరుబయట సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ (ఫైల్)



ఎంపీడీఓ గదిలో కుర్చీ

చిల్పూరు: మండల పరిషత్ కార్యాలయానికి పనిమీద వచ్చేవారు భవనం ఇరుకుగా ఉండటంతో ఇక్కట్లు పడాల్సి వస్తోంది. చిల్పూరు మండలంగా ఏర్పడినప్పటి నుంచి ఇరుకు గదిలోనే ఎంపీడీఓ కార్యాలయం కొనసాగుతోంది. మండలం ఏర్పడగానే తహసీల్ కార్యాలయానికి గౌడ సంఘం భవనం ఇచ్చారు. ఎంపీడీఓకు భవనం లేక పోవడంతో చిల్పూరుగుట్ట కింద ఏర్పాటుకు ప్రతిపాదించగా, సర్పంచ్ రాజ్‌కుమార్ సభ్యుల తీర్మానంతో నూతన భవనం పూర్తయ్యే వరకు జీపీకి కొత్తగా నిర్మించిన భవనాన్ని ఎంపీడీఓ కార్యాలయానికి ఇచ్చారు. ఇందులో ఒక వరండా, రెండు గదులు ఉన్నాయి. ఒకటి ఎంపీపీకి కేటాయించి అందులోనే ఫైళ్లు ఏర్పాటు చేశారు. మరొకగది ఉపాధిహామీ సిబ్బందికి, వరండాలో కార్యాలయ సిబ్బంది, ఎంపీఓ, అందులోనే ఒక కుర్చీ పట్టే చోట ఎంపీడీఓ, పక్కనే టీఫైబర్ మిషన్లను ఏర్పాటు చేశారు. ఆకస్మిక తనిఖీలకు అధికారులు వస్తే ఎంపీడీఓతో పాటు సిబ్బంది కుర్చీలు ఖాళీ చేసి నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక సమావేశాలు ఆరుబయటే నిర్వహించాల్సి వస్తోంది. ప్రస్తుతం జీపీ సిబ్బంది ఉపయోగిస్తున్న భవనం ఇరుకుగా ఉండడంతో ఎంపీడీఓ కోసం ఇచ్చిన భవనాన్ని ఖాళీ చేయాలంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను తీర్చాలని సిబ్బంది, కార్యాలయానికి పనికోసం వచ్చేవారు కోరుతున్నారు.

పాగాల సంపత్‌రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ కళింగరాజు, ఎంపీడీఓ హసీం తదితరులు

జనగామ రూరల్: జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి గుండె పోటుతో ఇటీవల మృతి చెందాడు. కాగా, మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన సంస్మరణ సభను నిర్వహించారు. ఎంపీపీ మేకల కళింగరాజు, ఎంపీడీఓ హసీం తదితరులు సంపత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంపత్‌రెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది. ఎంపీటీలు, సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాలు, మండలాలపై సవరణలు చేయాలి

జఫర్‌గఢ్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలు, మండలాలు, గ్రామాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సవరణలు చేపట్టాలని మహాజన ప్రజా పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి రవికుమార్ కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పరిపాలన సౌలభ్యం పేరుతో గత ప్రభుత్వం కొత్తగా చేపట్టిన జిల్లాలు, మండలాలు, గ్రామాల ఏర్పాటు అస్తవ్యస్తంగా మారిందన్నారు. వీటి ఏర్పాటుపై అనేక ప్రాంతాల్లో ప్రజలు అప్పట్లోనే తీవ్రంగా వ్యతిరేకించినా నాటి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. దీంతో కొత్తగా ఏర్పాటైన ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందుకే గత ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు సవరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామస్తులు పరిసరాల శుభ్రత పాటించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జీపీ సిబ్బంది గ్రామాల్లోని వార్డుల్లో పిచ్చి మొక్కలను తొలగించి మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఇళ్లలోని చెత్తను జీపీ ట్రాక్టర్లల్లో వేసే విధంగా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించాలి



మాట్లాడుతున్న మంగతాయారు

బచ్చన్నపేట: ఉపాధ్యాయులు పాఠాలను బోధించే సమయంలో తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి వాటికి అనుగుణంగా బోధన చేయాలని ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర కోఆర్డినేటర్ మంగతాయారు సూచించారు. శనివారం రాష్ట్ర పరిశీలక బృందం సభ్యులు రమేశ్, కొమురయ్యలతో కలిసి మండలంలోని పడమటికేశ్వాపూర్ సెకండరీ, ప్రాథమిక పాఠశాలలను, మండల కేంద్రంలోని సెంకడరీ పాఠశాలను సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయులు బోధించే పాఠాలు విన్నారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగారు. ప్రతి పాఠశాలలో పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందన్నారు. అలాగే తరగతి గదుల పరిసరాలను పరిశీలించారు. మండల నోడల్ అధికారి డివిఎల్ఎస్ మూర్తి, హెచ్ఎంలు చలపతిరెడ్డి, రజిత, జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సరీ మొక్కల పెంపకంలో లక్ష్యం చేరాలి



కూలీల పనులను పరిశీలిస్తున్న అధికారులు

దేవరుప్పుల: నిర్దేశిత సమయానికి నర్సరీ మొక్కల పెంపకంలో లక్ష్యం చేరాలని ఎంపీడీఓ వడ్డెపల్లి ఉమామహేశ్వర్ సూచించారు. శనివారం మండలంలోని సింగరాజుపల్లి, నీర్మాల, రామరాజుపల్లిలో ఉపాధి హామీ పనులు, నర్సరీ మొక్కల పెంపకం ప్రక్రియలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు కూలీలు ప్రదేశాలకు చేర్చి పనులు పటిష్టంగా చేయించి తగు వేతనం పడేలా ఫీల్డు అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాటుపడాలన్నారు. ఉపాధి హామీ ఏపీఏ కమ్మగాని శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంటు యాదగిరి, ఫీల్డు అసిస్టెంట్లు,పంచాయతీ కార్యదర్శులు భూపాల్, నర్సింహ్ములు, సంపత్, మధు, కృష్ణ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

జనగామ రూరల్: పట్టణంలోని వీవర్స్ కాలనీలోని గుడివద్ద శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం అధ్యక్షుడు కామని శ్రీనివాస్, అయ్యప్ప భక్తుల ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. అలాగే షుగర్ వ్యాధి నిర్ధారణపరీక్షలు చేపట్టారు. ఈ శిబిరంలో 20 యూనిట్ల రక్తం సేకరించినట్లు పూర్వ రీజియన్ చైర్మన్ ఏనుగు నర్సిరెడ్డి తెలిపారు. 55 మందికి షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. శ్రీరామ్, సమ్మయ్య, సత్యనారాయణ, యుగేందర్, వెంకటేష్, శ్రీనివాస్, రత్నం పాల్గొన్నారు.

మట్టి దందాపై విచారణ జరపాలి



మట్టి తరలింపునకు ఏర్పాటు చేసిన దారి

చిల్పూరు: నష్కల్ సమీపంలోని 143 సర్వే నంబర్ భూముల్లో మట్టి అక్రమ తరలింపుపై అధికారులు విచారణ చేపట్టాలని బీజేపీ బీసీ సెల్ నాయకుడు గంటె ఉపేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. మట్టి తవ్వకాలను శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన కొందరి రాజకీయ నాయకుల సహకారంతో తవ్వకాలు జరిపి మట్టి తరలిస్తున్నా సర్పంచ్, ఎంపీటీసీ, కార్యదర్శి పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ మట్టి అక్రమ తరలింపు దందాకు సహకరించే వారికి కూడా సమీపంలో భూములున్నాయని, వారి భూముల్లో ఎందుకు తవ్వకాలు చేపట్టడంలేదో చెప్పాలన్నారు. గ్రామంలో చిన్న పంచాయతీ జరిగితే పరిష్కరించేందుకు వచ్చే ప్రజాప్రతినిధులు మట్టి దందాను ఆపడంలో అశ్రద్ధ వహిస్తున్నారని, దీనిపై అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్య తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ శివారు జీబీ తండాకు చెందిన రైతు భూక్య నరేష్ ఈనెల 14న మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. నరేష్ మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా మృతుడి పిల్లల చదువు కోసం ఆర్థికంగా అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మారపాక రాములు, వార్డు సభ్యులు మారపాక పద్మ, నాగరాజు, పండుగ లక్ష్మి, అశోక్, రేణుక, ఎల్లస్వామి, కారోబార్ సలీం పాల్గొన్నారు.

కట్య్కార్‌లో..

బచ్చన్నపేట: మండలంలోని కట్య్కార్‌లో దొమ్మాట ఎల్లమ్మ మృతి చెందింది. కాగా బాధిత కుటుంబ సభ్యులను గ్రామ నాయకుడు నల్లనాగుల వెంకటాచారి పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయాన్ని శనివారం అందజేశారు.